మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా ఉండాల్సిన ఆవశ్యకతను పోలీస్ అధికారులు వివరించారు. నూజివీడు పట్టణంలోని కుమార్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం నూజివీడు డిఎస్‌పి ప్రసాద్ పర్యవేక్షణలో నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్య శ్రీనివాస్, ఎస్ఐ నాగేశ్వరరావు తమ సిబ్బందితో జాతీయ ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిరోధకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పోలీస్ అధికారులు మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల విద్యార్థుల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని ఎలా నాశనం చేస్తాయో ఉదాహరణలతో వివరించారు. ఈ వ్యసనాలు వారి కుటుంబాలను, సమాజాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో తెలిపారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం అనేది చట్టరీత్యా నేరమని, పట్టుబడితే కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, కుమార్ స్కూల్ కరస్పాండెంట్ పి.వి.కుమార్, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రులపై ఏదీ పర్యవేక్షణ..!

- ప్రయివేటు ఆసుపత్రుల్లో నిబంధనలు తూచ్
- అత్యధిక ఆసుపత్రుల్లో ఫైర్, ప్లానింగ్, విద్యుత్ అన్ని నిబంధనలు బేఖాతర్
- ప్రజలను ఇష్టానుసారంగా దోచేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువు
- ఏలూరు చైత్ర హాస్పటల్‌పై దాడితో ప్రయివేటు ఆసుపత్రులపై జనాల్లో చర్చ
- రెండు జిల్లాల్లో 400కు పైగా ప్రయివేటు ఆసుపత్రులు

చైత్ర ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రయివేటు ఆసుపత్రులపై పర్యవేక్షణ అనేది లేకుండా పోయింది. రెండు జిల్లాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. వైద్యఆరోగ్యశాఖ తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తోంది. ఆసుపత్రి నిర్మాణం నుంచి పార్కింగ్ వరకూ అన్నీ నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నా అడిగే నాథుడే లేకుండా పోయాడు. గత కొన్నేళ్లుగా రోగులను ఇష్టానుసారంగా దోచుకుతింటున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరులోని చైత్ర ఆసుప్రతిపై విజిలెన్స్ అధికారుల ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులు ఒక్కసారిగా దాడి చేయడం రెండు జిల్లాల్లోనూ హాట్‌టాపిక్‌గా మారింది. చైత్ర ఆసుపత్రితోపాటు నిబంధనలు పాటించని ప్రయివేటు ఆసుపత్రులన్నింటిపైనా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు ప్రయివేటు ఆసుపత్రులను గాడిన పెడతారో.. లేదో చూడాలి. ఏలూరు జిల్లాలో 250 ప్రయివేటు ఆసుపత్రులు ఉన్నాయి. వందకుపైగా వివిధ టెస్టులు నిర్వహించే ల్యాబ్‌లు, వంద వరకూ స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ దాదాపు అదేసంఖ్యలో ప్రయివేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. ప్రతిరోజూ వేల సంఖ్యలో రోగులు ఈ ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్తుంటారు. ఆసుపత్రి భవనం సరిగా నిర్మించారా.. ఫైర్ నిబంధనలు పాటించారా, విద్యుత్ కనెక్షన్లు, వైరింగ్ సక్రమంగా ఉన్నాయా, మెడికల్ స్టోర్స్ ఎలా నిర్వహిస్తున్నారు, పార్కింగ్ స్థలం ఉందా అనేవి ఏ ఒక్క అధికారీ పర్యవేక్షించిన పరిస్థితి లేదు. రెండు జిల్లాల్లో అత్యధిక ఆసుపత్రులు నిబంధనలకు విరుద్ధంగానే కొనసాగుతున్నాయి. అత్యధిక ఆసుపత్రులకు పార్కింగ్ స్థలం లేదంటే ఆశ్చర్యపోక తప్పదు. ఏలూరులోని అనేక ఆసుపత్రులకు రోడ్డునే పార్కింగ్ స్థలాలుగా ఉపయోగిస్తున్న పరిస్థితి ఉంది. ప్రయివేటు ఆసుపత్రుల్లో మెడికల్ స్టోర్స్, స్కానింగ్ సెంటర్ల నిబంధనల గురించి అడిగే నాథుడే లేకుండాపోయాడు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు అనేకం ఉన్నాయి. ఏదైనా ఫిర్యాదు వచ్చినప్పుడు తప్ప అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదు. అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు అందుతున్న కారణంగానే అటువైపు చూడటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోగుల ఇబ్బందులను ప్రభుత్వంగాని, జిల్లా అధికారులుగాని పట్టించుకోని దుస్థితి. ఏలూరు జిల్లాలో 31, పశ్చిమలో 23 ప్రయివేటు ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవలు సైతం అమలు జరుగుతున్నాయి. ఆయా ఆసుపత్రుల్లో పాటించాల్సిన నిబంధనల గురించి కూడా ఏ ఒక్క శాఖా పట్టించుకోవడం లేదు.

అతిపెద్ద వ్యాపారంగా వైద్యం

సేవాభావంతో చేయాల్సిన వైద్యాన్ని అతిపెద్ద వ్యాపారంగా మార్చేసిన పరిస్థితి ఉంది. ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలు రాజకీయ నాయకులను, అధికారులను గుప్పెట్లో పెట్టుకుని ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నాయి. చిన్నపాటి అనారోగ్య సమస్యతో ఆసుపత్రికి వెళ్లినా రూ.వేల్లో వసూలు చేస్తున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో రూ.లక్షల్లో వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. కరోనాలో ఏలూరులోని చైత్ర ఆసుపత్రితోపాటు, మరో ఆసుపత్రి యాజమాన్యం రోగులను పీల్చి పిప్పి చేస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక ఆసుపత్రిపై చర్యలు తీసుకున్న అధికారులు అప్పటి అధికార పార్టీ అండ ఉన్న చైత్ర ఆసుపత్రిపై మాత్రం కనీస చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు చైత్ర ఆసుపత్రిపై విజిలెన్స్‌తోపాటు వైద్య, విద్యుత్, డ్రగ్స్‌కంట్రోల్, అగ్నిమాపకశాఖ అధికారులంతా ఏకకాలంలో దాడి చేశారు. చైత్ర ఆసుపత్రిని కాకుండా ప్రయివేటు ఆసుపత్రుల్లో జరుగుతున్న అవకతవకలపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

నేడు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పర్యటన ఇలా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సోమవారం ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఉదయం పది గంటలకు హైదరాబాద్ నుంచి విమానంలో రాజమండ్రి చేరుకుంటారు. 10.05 గంటలకు రాజమండ్రి నుంచి రోడ్డుమార్గం గుండా బయలుదేరి 11.30 గంటలకు కొయ్యలగూడెం మండలంలోని రాజవరం చేరుకుని పొంగుటూరు-లక్కవరం రోడ్డును పరిశీలిస్తారు. అక్కడ నుంచి 11.40కు బయలుదేరి ద్వారకాతిరుమల మండలం జగన్నాథపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకుంటారు. 12 గంటకు దర్శనం చేసుకుని అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. దాదాపు 45 నిమిషాలు అక్కడ ఉండనున్నారు. అనంతరం రోడ్డుమార్గం గుండా రాజవరం చేరుకుంటారు. అక్కడ నుంచి విమానంలో గన్నవరం చేరుకుంటారు. తొలుత రాజమండ్రి నుంచి హెలీకాప్టర్‌లో కొయ్యలగూడెం మండలంలోని రాజవరం చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. అనివార్య కారణాలతో హెలీకాప్టర్ ప్రయాణం రద్దు చేసి డిప్యూటీ సిఎం రోడ్డు మార్గంలో వచ్చేవిధంగా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

డిప్యూటీ సిఎం పర్యటనకు పటిష్ట భద్రత

ఐఎస్.జగన్నాథపురంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి, జెసి

ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

జిల్లాలో ఈనెల 24వ తేదీ సోమవారం ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పర్యటనకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఐఎస్.జగన్నాథపురంలో పవన్ పర్యటన ఏర్పాట్లను ఆమె జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిప్యూటీ సిఎం ఈ నెల 24న కొయ్యలగూడెం మండలం రాజవరం, ద్వారకాతిరుమల మండలం ఐఎస్.జగన్నాథపురంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ కట్టుదిట్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. పార్కింగు ప్లేస్‌లు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా పిజిఆర్‌ఎస్

కలెక్టర్, జెసి అందుబాటులో ఉండరు: డిఆర్‌ఒ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఈ నెల 24వ తేదీన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్‌ఎస్) కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సోమవారం డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పర్యటించనున్న దృష్ట్యా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ జిల్లా కలెక్టరేట్‌లో జరగనున్న పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో అందుబాటులో ఉండరని పేర్కొన్నారు. డిఆర్‌ఒ, ఇతర అధికారులు కలెక్టరేట్‌లో యథావిధిగా వినతులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు తమ అర్జీలు అందించొచ్చని పేర్కొన్నారు.

ప్రతిఒక్కరూ తోటివారికి సాయపడాలి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతిఒక్కరూ తోటివారికి సాయపడాలని, సత్యసాయి సందేశం ఇదేనని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఆదివారం శ్రీ సత్య సాయి శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన కలెక్టర్, ఆపై సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో శ్రీసత్యసాయి వందో పుట్టినరోజు సందర్భంగా శత జయంతి ఉత్సవాలను జిల్లాలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ తమకు తోచిన సేవ చేయాలని, అప్పుడే జీవితం సార్థకతమవుతుందని అన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో సత్యసాయి ట్రస్టులో విద్య, వైద్యం, సేవా కార్యక్రమాలు వెలకట్టలేనివని అన్నారు. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్స్ ద్వారా కీలకమైన శస్త్రచికిత్సలు చేస్తూ లక్షలాదిమందికి పునర్జన్మనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, ఎఎన్‌వి.నాంచారయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సత్యసాయి సేవా సమితి జిల్లా ఇన్‌ఛార్జి సోడిశెట్టి శాంతకుమార్, ఏలూరు సమితి కన్వీనర్ పైడేటి రామారావు, డి.శ్రీనివాసాచార్యులు, సత్యసాయి సేవాసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

50 శాతం హరిత ఆవరణంగా మార్చడమే లక్ష్యం

జిల్లాలో విస్తృతంగా మొక్కలు నాటేందుకు కృషి : డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (సామాజిక వన విభాగం) సిహెచ్.సూర్యనారాయణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా భూభాగంలో 50 శాతం హరిత ఆవరణంగా మార్చడానికి రానున్న కాలంలో మొక్కలు విస్తృతంగా నాటనున్నట్లు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (సామాజిక వన విభాగం) సిహెచ్.సూర్యనారాయణ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఎంతశాతం హరిత ఆవరణం ఉంది, ఎన్నిచోట్ల అటవీ నర్సరీలు ఉన్నాయి, గత సంవత్సరం ఎన్ని మొక్కలు పంపిణీ చేశారు వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: సామాజిక వన విభాగం విధులు, లక్ష్యం ఏమిటి?

డిఎఫ్ఒ: ప్రపంచంలో రోజురోజుకీ కాలుష్యం పెరిగిపోయి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్న నేపథ్యంలో పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు సామాజిక వన విభాగం పని చేస్తుంది. దీనికోసం నర్సరీలు ఏర్పాటు చేయడం, మొక్కలను పెంచి, వాటిని రైతులకు, ఆసక్తి ఉన్న ఇతరులకు అందించడం ద్వారా హరిత ఆవరణం పెంచుతున్నాం.

ప్రశ్న: నేషనల్ ఫారెస్ట్ పాలసీ ప్రకారం జిల్లాలో ఎంత గ్రీన్ కవరేజ్ ఉండాలి? ప్రస్తుతం ఎంత ఉంది?

డిఎఫ్ఒ: 1980 నేషనల్ ఫారెస్ట్ పాలసీ రూల్ ప్రకారం ఎక్కడైనా సరే ఉన్న భూభాగంలో 33 శాతం గ్రీన్ కవరేజీ ఉండాలి. అయితే ఏలూరు జిల్లాలోని భూభాగంలో 15 శాతం నోటిఫైడ్ ఫారెస్ట్ అంటే రిజర్వ్ ఫారెస్ట్ ఉంది. మొత్తం పచ్చదనం చూస్తే 25 శాతం ఉంది. ఈ సంవత్సరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవరేజ్ ఉండాలని ఆదేశాలు ఇవ్వడంతో ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం.

ప్రశ్న: జిల్లాలో ఏఏ ప్రాంతాల్లో ఫారెస్ట్ నర్సరీలు ఉన్నాయి? వాటి ద్వారా గత సంవత్సరం ఎన్ని మొక్కలు పంపిణీ చేశారు?

డిఎఫ్ఒ: జిల్లాలో మొత్తం పది ప్రాంతాల్లో సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో నర్సరీలు నిర్వహిస్తున్నారు. శనివారపుపేట, రామసింగవరం, ఉంగుటూరు, వెంకటరామన్నగూడెం, ఫాతిమాపురం, నామవరం, తడికలపూడి, మర్లగూడెం, ధనంవారిగూడెం, బత్తులవారిగూడెంల్లో నర్సరీలు ఉన్నాయి. గత సంవత్సరం మార్చి నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు 20 లక్షల మొక్కలు పంపిణీ చేశాం. ఈ సంవత్సరం 66 లక్షలు మొక్కలు పంపిణీ చేయడం లక్ష్యంగా పని చేస్తున్నాం. జిల్లాలో మరో 9 నర్సరీల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి.

ప్రశ్న: నర్సరీల ద్వారా ఏ మొక్కలు పంపిణీ చేస్తున్నారు? రైతులకు ఆదాయాన్నిచ్చే మొక్కలు కూడా పంపిణీ చేస్తారా?

డిఎఫ్ఒ: రెండు రకాల మొక్కలు పంపిణీ చేస్తున్నాం. ఆదాయం కోసం టేకు, వేగిస, నల్లమద్ది, తెల్ల మద్ది, కానుగ, వేప, వెదురు, మారేడు, ఉసిరి, వెలగ, కదంబ, మహాగని వంటి మొక్కలు పంపిణీ చేస్తాం. దీనిలో టేకు వృక్షాలు రైతులకు మంచి ఆదాయాన్ని ఇస్తాయి. 20 సంవత్సరాలు పెంచితే మంచి ఆదాయం వస్తుంది.

ప్రశ్న: నర్సరీల నిర్వహణకు నిధులు ఏమైనా వస్తాయా? వీటిలో ఎవరు పని చేస్తారు?

డిఎఫ్ఒ: వన సంరక్షణ సమితుల ద్వారా నర్సరీల నిర్వహణ అంటే మట్టి సేకరించడం, విత్తనాలు నాటడం, వాటికి నీరు పోయడం వంటివి వన సంరక్షణ సమితి సభ్యుల ద్వారా చేస్తున్నాం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద ద్వారా వారికి సొమ్ము చెల్లిస్తున్నాం.

ప్రశ్న: రైతులకు లేదా మొక్కలు పెంచేందుకు ఆసక్తి చూపించే వివిధ వర్గాల వారికి ఉచితంగానే మొక్కలు అందజేస్తారా?

డిఎఫ్ఒ: అవును. రైతులకు, ఖాళీ ప్రదేశాలు ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు వంటి వాటికి ఉచితంగానే పంపిణీ చేస్తాం. అదే పరిశ్రమలకు అయితే జిల్లా కలెక్టర్ నిర్ణయించిన నామమాత్రపు ధరకు ఇస్తున్నాం.

ప్రశ్న: ప్రస్తుతం అభివృద్ధి పేరుతో అడవులు తరిగిపోతున్న ఈ తరుణంలో రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎఫ్ఒ: ఫారెస్ట్ ఏరియాలో అటవీశాఖలోని మరో రెండు విభాగాలైన టెరిటోరియల్, వైల్డ్ లైఫ్ విభాగాలు స్థలాలను గుర్తించాలి. అక్కడ మొక్కలు నాటడం, వాటిని సంరక్షించటం అంతా ఆ రెండు విభాగాలు చూసుకోవాలి. వారికి మొక్కలు సరఫరా చేయడం వరకే మా బాధ్యత.

ప్రశ్న: టేకు మొక్కలు పెంచేందుకు అనుమతి అవసరమా?

డిఎఫ్ఒ: లేదు. టేకు మొక్కలు పెంచడానికి ఎలాంటి అనుమతీ అవసరం లేదు. అయితే వాటిని నరికేటప్పుడు మాత్రం కచ్చితంగా అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా నరికినా, రవాణా చేసినా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి.

ప్రశ్న: జిల్లాలో 50 శాతం మేరకు పచ్చదనం పెంచేందుకు అనువైన పరిస్థితులు ఉన్నాయా?

డిఎఫ్ఒ: ఈ జిల్లాలో రైతులు ఎక్కువ వ్యవసాయ, ఉద్యాన పంటలకు మొగ్గు చూపుతున్నారు. దానివల్ల ఆయా ప్రాంతాల్లో చెట్లు పెంచడం సాధ్యం కాదు. అయితే ఖాళీగా ఉన్న ఇతర ప్రాంతాల్లో చెట్లు నాటేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

ప్రశ్న: చివరిగా ప్రజలకు మీరు ఇచ్చే సూచనలు ఏంటి?

డిఎఫ్ఒ: ప్రజల్లో మార్పు రావాల్సిన అవసరం ఉంది. రోజురోజుకీ కాలుష్యం పెరిగిపోయి పర్యావరణం దెబ్బతింటున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటేందుకు ముందుకు రావాలి. ఎక్కడ పచ్చదనం ఎక్కువగా ఉంటుందో అక్కడ వాతావరణం ఆహ్లాదంగా, కాలుష్యరహితంగా ఉండటంతోపాటు టూరిజం కూడా అభివృద్ధి చెందుతుంది. వాతావరణ సమస్యలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అంటే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఖాళీ ప్రదేశాలు గుర్తించి 50 శాతం హరిత ఆవరణం ఉండేలా విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు స్వచ్ఛంద సంస్థలు, సామాజికవేత్తలు కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. తద్వారా భావితరాలకు కాలుష్యం లేని మంచి సమాజాన్ని అందించగలుగుతాం.

పెట్రోల్ బంక్ కుంభకోణంపై సమగ్రంగా విచారించాలి

యూనియన్ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు

డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ఆర్‌టిసి సంస్థ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో గత నాలుగు సంవత్సరాలుగా జరిగిన రూ.83 లక్షల కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పెట్రోల్ బంక్ అవకతవకలపై సరైన విచారణ చేయకుండా దిగువ స్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకోవడాన్ని ఖండిస్తూ మూడో రోజు ఆదివారం ఏలూరు డిపో వద్ద కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్‌టిసి పెట్రోల్ బంకులో జరిగిన అవకతవకలకు సంబంధించి నలుగురు దిగువ స్థాయి ఉద్యోగులను సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. సోమవారం నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. 2021లో బంకు ఏర్పాటు చేసిన నాటి నుంచి పెట్రోలు అమ్మకాల్లో అవకతవకలు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారని, ఎందుకు అప్పటినుంచి చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. పెట్రోల్ బంకు నిర్వహణలో 14 నుంచి 21 మందికి ప్రమేయం ఉన్నట్టు తేల్చి జరిగిన 82 లక్షల కుంభకోణాన్ని వీరంతా చెల్లించాలని చెప్పడం సమంజసం కాదన్నారు. చేయని తప్పుకు డబ్బులు చెల్లించే స్తోమత తమకు లేదని చెప్పిన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసి మిగిలిన వారిని వదిలేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. రేపటి నుంచి నిరాహార దీక్షలును జిల్లా స్థాయిలో చేపడతామని, అవసరమైతే జోనల్ స్థాయిలో కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వం, ఆర్‌టిసి యాజమాన్యం దిగివచ్చి జరిగిన దానిపై సరైన చర్యలు తీసుకునే వరకు ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా బంకులో నిధుల కుంభకోణం జరుగుతుంటే ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వారి తప్పులను కప్పిపుచ్చు కోవడానికి డిపోలో పనిచేస్తున్న నలుగురు సాధారణ ఉద్యోగులను ఏకపక్షంగా దోషులుగా నిర్ణయించి సస్పెండ్ చేయడాన్ని కార్మికవర్గం, కార్మిక సంఘాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయన్నారు. నిజాయితీపరులైన ఆడిటర్ సుందరయ్య, ఎంఎస్.రావుతో పాటు మరో ఇద్దరిని సస్పెండ్ చేయడం సరైంది కాదని, దీనిలో ప్రమేయం ఉన్న డిపో మేనేజర్, జిల్లా రవాణా సంస్థ అధికారిని ముందు సస్పెండ్ చేయాలని ప్రసాద్ డిమాండ్ చేశారు. టెక్నాలజీ ఇంత పెరిగినప్పటికీ అవకతవకలపై ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రసాద్ ప్రశ్నించారు. సిఐటియుతో పాటు ఇతర సంఘాలను కలుపుకొని వెళ్లి ఆర్‌టిసి సంస్థ యాజమాన్య వైఖరిపై ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. దీనిపై ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు.

అన్నదాత గుండెల్లో గుబులు..!

- తుపాను హెచ్చరికలతో ఉరుకులు, పరుగులు
- ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు హడావుడి
- గత తుపాను నష్టం మానక ముందే మరో గండం
- లబోదిబోమంటున్న కౌలు రైతులు

రోడ్డు వెంబడి ఆరబెడుతున్న ధాన్యం రాసులు

మిల్లు వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మొంథా తుపాను గాయం ఇంకా మానక ముందే మరో తుపాను గండం కష్టం అన్నదాతకు వచ్చి పడింది. మూలుగే నక్కపై తాడిపండు పడ్డచందంగా తయారైంది రైతు పరిస్థితి. తుపాను వస్తుందన్న ప్రచారంతో మండలంలోని రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. గత మూడు రోజులుగా తుపాను హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మొంథా తుపాన్‌తో రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారు. మరో తుపాను గండం వచ్చి పడడంతో మిగిలిన అరకొర దిగుబడులను కాపాడుకునేందుకు రైతులు పొలాల వైపు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. గత నెలలో వచ్చిన తుపాను దెబ్బకు పంట నేలపడడంతో, ఉన్న పంట దెబ్బ తినడంతో తేమ శాతం బాగా పెరిగింది. 17 శాతం నిబంధన వల్ల రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే పనుల్లో ఉన్నారు. ఈ తరుణంలో వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు హైరానా పడుతున్నారు. దీంతో యంత్రాల ద్వారా కోసిన పంటను ఆరబెట్టకుండా నేరుగా మిల్లుకు తరలించే పనుల్లో రైతులు హడావుడిగా ఉన్నారు. ఇప్పటికే విత్తు నుంచి పంట నూర్పుడి వరకు ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టామని రైతులు చెబుతున్నారు. గత తుపాను ప్రభావంతో పంట దిగిబడులు బాగా తగ్గి వ్యవసాయ ఖర్చులు బాగా పెరిగాయన్నారు. ప్రస్తుతం కోత మిషన్ల కొరత కూడా బాగా ఉందన్నారు. గతంలో ఎకరా(నిలబడి ఉన్న) వరిని మిషన్ గంట కోసేదని, ప్రస్తుతం పైరు నేల పడిపోవడంతో మూడు గంటల పైబడి కోయడానికి సమయం పడుతుందన్నారు. దీంతో ఎకరాకు పదివేల రూపాయల వరకు మిషన్ కోతకు ఖర్చవుతుందని రైతులు అంటున్నారు. ఒక ఎకరాకు గతంలో రూ.32 వేలు అయితే ప్రస్తుతం రూ.3,500 వరకు కిరాయి వసూలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎకరాకు 40 బస్తాలు వచ్చే దిగుబడులు గత తుపాను ప్రభావంతో 15 బస్తాలు తగ్గాయంటున్నారు. ఎకరాకు 25 బస్తాలు మాత్రమే దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. తుపాను ప్రభావంతో కోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు చేసేది లేక రైతులు యంత్రాలకు, కూలీలకు అధిక ఖర్చులు చెల్లించి పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు జాతీయ రహదారి వెంబడి ఆరబెట్టిన ధాన్యపు రాసులు దర్శనమిస్తున్నాయి. మండలంలో ముందుగా వెదజల్లిన చేలు కోతకు రావడంతో రైతులు మాసూళ్లు ప్రారంభించారు. ఈ తరుణంగా తుపాను వార్తలతో రైతులు రోడ్ల వెంబడి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని ట్రాక్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించి, ట్రాక్టర్లు, లారీల్లో లోడ్ చేసి మిల్లులకు తరలించే పనులు చేపట్టారు. దీంతో పలు మిల్లులు వద్ద అన్లోడింగ్ ఆలస్యం కావడంతో ట్రాక్టర్లు బరులు తీరాయి. పెట్టుబడులు కూడా రాకపోవడంతో కౌలు రైతులు ఏమి చేయాలో తెలియక లబోదిబోమంటూ తలలు పట్టుకుంటున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 2,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు సమాచారం. మండలంలో 14,500 ఎకరాల్లో సార్వా వరి సాగు చేయగా ఇప్పటివరకు సుమారు 2,500 ఎకరాల్లో వరి కోత పూర్తయినట్లు తెలిసింది.

యంత్రాల కొరత బాగా ఉంది

అనగాని వెంకటేశ్వరరావు, రైతు, అప్పారావుపేట

మండలంలో యంత్రాల కొరత బాగా ఉంది. మొంథా తుపాను కారణంగా చేలన్ని నేలనంటాయి. దీంతో కోత ఖర్చులు బాగా పెరిగాయి. గతంలో ఎకరా కోసేందుకు గంటకు రూ.3,200 కాగా, ప్రస్తుతం రూ.3,500 అడుగుతున్నారు. గతంలో ఎకరం కోయడానికి మిషన్ గంటం పావులో కోసేది. తుపాను కారణంగా పైరు మొత్తం చాపల నేల వాలడంతో ఎకరం కోయడానికి మిషన్‌కు మూడు గంటల పైబడి సమయం పడుతుంది. దీంతో ఎకరం కోయడానికి ఖర్చు రూ.10 వేలు అవుతుంది. రైతులంతా తుపాను కంగారులో ఒకేసారి కోతలు కోయడంతో మిషన్‌కు ఆర్డర్ ఇచ్చిన 10 రోజులకు గాని రావడం లేదు.

పంట దిగుబడులు బాగా తగ్గాయి

పి.గోపిరెడ్డి, రైతు, వడాలి

గత నెలలో వచ్చిన తుపానులతో పంట దిగుబడులు బాగా తగ్గాయి. విత్తనం వేసిన దగ్గర నుంచి పంట నూర్చే వరకు భారీ వర్షాలు, తుపాన్లు వస్తూనే ఉన్నాయి. దీంతో అధిక వర్షాలు పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. గతంలో ఎకరాకు 40 బస్తాల పైబడి దిగుబడి రాగా భారీ వర్షాల కారణంగా దిగుబడులు ఎకరాకు పది నుంచి 15 బస్తాల వరకు తగ్గాయి. దీంతో పెట్టుబడులు కూడా రాలేదు.

పేరుపాలెం బీచ్‌లో ఏలూరు యువకుడు గల్లంతు

ప్రజాశక్తి - మొగల్తూరు

గణేష్(ఫైల్ ఫొటో)

స్నానం చేసి వెంటనే వస్తానని సముద్రంలోకి దిగిన ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతైన ఘటన పేరుపాలెం బీచ్‌లో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పేరుపాలెం బీచ్‌కు ఏలూరులోని కొత్తపేటకు చెందిన మునగాల మోహన్‌సాయి గణేష్ (19), తన ఇంటి సమీపంలోని ముగ్గురు మిత్రులతో కలిసి ఆదివారం ఉదయం మోటారు సైకిళ్లపై చేరుకున్నారు. కొద్దిసేపు బీచ్‌లో స్నానాలు చేశారు. అనంతరం ఒడ్డుకు వచ్చారు. మిత్రులను ఒడ్డున కూర్చోమని, తాను వెంటనే స్నానం చేసి వస్తానంటూ సాయిగణేష్ మరోసారి సముద్రం లోపలికి వెళ్లాడు. అలల ఉధృతికి గణేష్ గల్లంతయ్యాడు. ఈ విషయం తెలియగానే మొగల్తూరు ఎస్ఐ జి.వాసు, మెరైన్ అంతర్వేది ఎస్ఐ పి.సోమశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. మోహన్‌సాయిగణేష్ విజయవాడ సమీపంలోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దీనిపై గణేష్ చిన్నాన్న సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వాసు తెలిపారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ బడేటి

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు చర్యలు

ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వంతో మాట్లాడి అన్ని చర్యలు తీసుకుంటానని ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య తెలిపారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరు శివారు చోడిమెళ్లలోని త్రిమూర్తులు గార్డెన్స్‌లో కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు జర్నలిస్టులకు సంబంధించిన పలు సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకువెళ్లగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలతో పాటు హెల్త్ కార్డులు, ఇతర సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి, అవసరమైతే సంబంధిత మంత్రులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబును యూనియన్ నాయకులు సన్మానించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు జబీర్, కార్యదర్శి హరీష్‌తోపాటు వందలాది జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

నిజాయితీపరులను శిక్షించడం దారుణం : సిఐటియు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజారవాణా వ్యవస్థ ఎపిఎస్ఆర్‌టిసి ఏలూరు డిపోలో యాజమాన్యంచే నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో లక్షలాది రూపాయల ఆయిల్ మాయం కేసులో నిజాయితీపరులను శిక్షించడం దారుణమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వివిఎస్.నారాయణ, చింతలపూడి మండల కన్వీనర్ నత్తా వెంకటేశ్వరరావు ఆర్‌టిసి ఉన్నతాధికారుల తీరును ఖండించారు. అవినీతి చేసిన అధికారి స్థాయి నుండి కింది స్థాయి వరకు డబ్బు రికవరీ చేసి వారిని శిక్షించకుండా వదిలేసి, దీంట్లో ఏ సంబంధం లేని వ్యక్తులను ఎపిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్యను సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఒక ప్రకటనలో దొంగతనం చేసిన వారు దొంగిలించిన తిరిగి ఆ డబ్బు జమ చేస్తే వారికి ఏవిధమైన శిక్ష విధించకూడదా ఈ కేసులో ఎటువంటి సంబంధం లేని, నిజాయితీగా పనిచేస్తున్న నాయకులను ఇరికించి అధికారులు చేసిన తప్పును వారి మీదకు నెట్టి, నాయకులు సుందరయ్య, ఇతరులను సస్పెండ్ చేయడం ఆర్‌టిసి చరిత్రలోనే కొత్త అధ్యాయనానికి ఉన్నతాధికారులు తెరలేపారన్నారు. వెంటనే తప్పు చేసిన వారిని శిక్షించి అన్యాయంగా, అక్రమంగా సస్పెండ్ చేసిన యూనియన్ రాష్ట్ర నాయకులు సుందరయ్య, ఇతరులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని, బస్సుల్లో ఒక కండక్టర్ పొరపాటున డబ్బులు తీసుకుని టికెట్ ఇవ్వలేదని ఆ డబ్బులు కండక్టర్ చెల్లిస్తాను అంటే ఎటువంటి శిక్ష లేకుండా వదిలేస్తారా అని ఆర్‌టిసి ఉన్నత యాజమాన్యాన్ని ప్రశ్నించారు.

ఏలూరు అర్బన్ : ఆర్‌టిసి డీజిల్ ఆయిల్ బంకులో జరిగిన రూ.83 లక్షల స్కామ్‌పై సమగ్రవిచారణ చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత రెండు మాసాలుగా ఆర్‌టిసి ఆయిల్ బంకులో అవినీతి జరిగిందని వివిధ పత్రికలలో, ఎలక్ట్రానిక్ మీడియాలో కథనాలు వస్తున్నప్పటికీ ఆర్‌టిసి యాజమాన్యం పోలీస్ దర్యాప్తుకు ఎందుకు సిద్ధం కాలేదో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయిందని ఆయన పేర్కొన్నారు. పోలీస్ దర్యాప్తు చేసి ఎవరైతే బాధ్యులుగా నిర్ధారించబడతారో వారిపై చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పోలీస్ దర్యాప్తు చేయకుండా కొంతమంది అధికారులతో, కొంతమంది జూనియర్ గుమస్తాలతో సుమారు రూ.50 లక్షలు 9 మంది ద్వారా కట్టించుకుని వారిని స్కామ్ నుండి మినహాయించినట్లు తెలుస్తుందని, మరో నలుగురు మాకు సంబంధం లేదని డబ్బులు కట్టలేదని, ఆ నలుగురిని ఆర్‌టిసి యాజమాన్యం నాలుగు రోజుల క్రితం సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతితో సంబంధం ఉన్నవారు ఎవరో నిర్ధారించకుండా, కొంతమందితో కొంత డబ్బు కట్టించుకొని వారికి జరిగిన స్కామ్‌తో సంబంధం లేదన్నట్లు యాజమాన్యం పరిగణించడం చాలా అనుమానాలకు దారితీస్తుందని ఆయన అన్నారు.

పలుచోట్ల సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

శ్రీసత్యసాయిబాబా శత జయంతి పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కన్నాయిగూడెం గ్రామంలో ఉదయం ప్రత్యేక పూజలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాబా శత జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. గోదావరి నీటి ద్వారా ప్రజలకు తాగునీరు అందించడంలో బాబా చేసిన కృషి ఎంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు. గ్రామస్తులు, సేవాదళ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఉంగుటూరు : పుట్టపర్తి సత్యసాయి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉంగుటూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన విగ్రహానికి నివాళులు అర్పించి సత్యసాయి చేసిన సేవలను స్మరించుకున్నారు. డిప్యూటీ ఎంపిడిఒ గెడ్డం రమేష్‌బాబు, ఫణీంద్ర, పంచాయతీ కార్యదర్శి బొర్రు రవివర్ధన కుమార్ పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

కలుపు మందు తాగి యువకుడు మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కలుపు మందు తాగి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని బొర్రంపాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన నేటి కిరణ్ కుమార్(18) చదువు మానేసి ప్రస్తుతం కూలీ పనులకు వెళుతున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై బాధ్యతా రాహిత్యంగా తిరుగుతుండడంతో తండ్రి మందలించాడు. ఈనెల 21వ తేదీన బొర్రంపాలెం గ్రామ శివార్లలో గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కన కలుపు మందు తాగాడు. దీంతో అతడిని కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుని తండ్రి నేటి సుధాకర్ ఫిర్యాదుతో హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంగం వాగులో మునిగి యువకుడు మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

యశ్వంత్ (ఫైల్ ఫొటో)

ఈత కొట్టడానికి వెళ్లి గుండంలో మునిగి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని కామయ్యపాలెం పంచాయతీ పరిధిలో బొత్తప్పగూడెం సమీపంలో ఉన్న సంగం వాగులో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేట మండలం దొంతికుంట గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు సెలవు రోజు కావడంతో సంగం వాగుకి ఈత కొట్టడానికి వెళ్లారు. ఈత కొడుతూ గుండం వైపు వెళ్లగా పలువురు మునిగారు. వెంటనే స్థానికులు అప్రమత్తమై వారిని బయటకు తీయగా అందులో జి.యశ్వంత్(బిట్టు)(16) అనే యువకుడు మృతిచెందగా పలువురు ప్రాణాలతో బయట పడ్డారు. వెంటనే యువకుడు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

పెళ్లి వ్యాను బోల్తా

తప్పిన పెను ప్రమాదం

పలువురికి గాయాలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని కోట రామచంద్రపురం ఐటిడిఎ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. రాజానగరం నుంచి పోలవరం మండలం గుండెపాలెంకు వ్యాన్‌లో పెళ్లికి వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. వ్యాన్‌లో ఉన్న మహిళలు, చిన్నారులకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టి ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

డిప్యూటీ ఎంపిడిఒ పోస్టు భర్తీపై ఉత్కంఠ!

- పనితీరా..? సామాజిక తరగతా..?
- నియోజకవర్గ ప్రజాప్రతినిధి సిఫార్సు ఎవరికో..

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలో డిప్యూటీ ఎంపిడిఒ పోస్టులకు నలుగురు ఉద్యోగులు ప్రమోషన్ పొందారు. ఆ నలుగురులో ఇద్దరు చాలా కాలం నుంచి ఉంగుటూరు మండలంలోనే పనిచేస్తుండగా మిగతా ఇద్దరు ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన వారే. కాగా ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు, మరొకరు పంచాయతీ రాజ్(మినిస్ట్రీరియల్ డిపార్ట్‌మెంట్) ఉద్యోగి. అయితే సదరు ఈ నలుగురిలో ఇద్దరు మండలంలోనే డిప్యూటీ ఎంపిడిఒలుగా పనిచేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అంతిమంగా నియోజకవర్గ ప్రజాప్రతినిధి సిఫార్సు ఎవరికి ఉంటే వారికే ఆ పోస్టు దక్కుతుందని అంటున్నారు. ఈక్రమంలో మినిస్టీరియల్ విభాగంలో పనిచేసే వ్యక్తికి అన్ని శాఖల విభాగాల్లో అనుభవం, కంప్యూటర్ నాలెడ్జి, వివిధ శాఖల పరిజ్ఞానం పుష్కలంగా ఉంది. మరో వ్యక్తి విషయ పరిజ్ఞానం, కంప్యూటర్ నాలెడ్జి లేనట్టు తెలుస్తోంది. ఈ మండలానికి రెండు డిప్యూటీ ఎంపిడిఒ పోస్టులు ఉన్నాయి. ఒక డిప్యూటీ ఎంపిడిఒ పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీల నిధులు, వినియోగం, పారిశుధ్యం, పంచాయతీల బలోపేతం తదితర అంశాలను పర్యవేక్షిస్తున్నారు. ఇంకో డిప్యూటీ ఎంపిడిఒ సచివాలయాలు, వాటిలో పనిచేసే ఉద్యోగులపై అజమాయిషి, పర్యవేక్షణ ఉండనుంది. అయితే పంచాయతీలో డివైఎంపిడిఒ పోస్టుకి నెల కిందటే బదిలీపై ఒకరు జాయిన్ అయ్యారు. ఇక రెండో డిప్యూటీ ఎంపిడిఒ పోస్టు కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు తలమునకై ఉన్నారు. నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన ఇక్కడ అంకితభావంతో పనిచేస్తూ అన్ని గ్రామాలు, అన్ని సచివాలయాల్లో బాగా పరిచయాలు, అవగాహన ఉండే వ్యక్తిని నియమిస్తే ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలు పరుగులు పెట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే పనితీరుకు పట్టం కడతారా? సామాజిక తరగతికి ప్రాధాన్యత ఇస్తారా? అనేది ప్రస్తుతం హాట్ టాఫిక్‌గా మారింది.

ఎంపిడిఒ కార్యాలయం

బాలలకు అన్ని అంశాలపై అవగాహనుండాలి

ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బాలలకు కేవలం పుస్తకంశాలు మాత్రమే కాకుండా చట్ట సభలు, వాటి పని తీరు, సామాజిక అభ్యున్నతి, మారుతున్న టెక్నాలజీ, రాజకీయాలు, ప్రభుత్వ వ్యవస్థల పనితీరు, రాష్ట్ర అభివృద్ధి వంటి అంశాలపై సైతం వారికి అవగాహన కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణ తెలిపారు. బాలల్లో చట్టసభల గొప్పతనం, వాటి పనితీరుపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రూపొందించిన బాలల మాక్ అసెంబ్లీకి ఏలూరు నియోజకవర్గంలో జరిగిన పోటీల్లో అన్ని రంగాల్లో ప్రతిభ చాటి మాక్ అసెంబ్లీకి నియోజకవర్గ స్థాయి విజేతగా ఏలూరు నియోజకవర్గం సుబ్బమ్మ దేవి హై స్కూల్ పదవ తరగతి విద్యార్థిని గంధం లితిక ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గంధం లితిక మాట్లాడుతూ ఎంతో అత్యున్నతమైన రాష్ట్ర అసెంబ్లీలో తాను ఏలూరు నియోజకవర్గం ప్రతినిధిగా ఎంపికై అసెంబ్లీకి వెళ్లడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని, తనను ప్రోత్సహించి అభినందించిన ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణకి కూటమి ప్రభుత్వానికి, పాఠశాల అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బమ్మ దేవి హై స్కూల్ హెడ్మాస్టర్ పి.కుటుంబరావుతో పాటు బాలిక తల్లిదండ్రులు తండ్రి గంధం రాజు, రమాదేవి పాల్గొన్నారు.

బాలికను అభినందిస్తున్న ఎంఎల్ఎ బడేటి

కొనసాగిన మొక్కజొన్న రైతుల దీక్ష

సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు సంఘీభావం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని హనుమాన్‌గూడెం గ్రామంలో మొక్కజొన్న రైతులు విత్తన పంట బకాయిల కోసం చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం ఐదో రోజు కొనసాగాయి. ఈ దీక్షలకు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. కంపెనీల పేర్లు లేకుండా స్థానికంగా మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్ విత్తనాలు అమ్ముతూ అమాయకులైన కొందరు రైతులను మోసగిస్తున్నారని, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు, పోలీసులు జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ రైతులకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోసపోయిన మొక్కజొన్న విత్తన రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రతి ధాన్యం గింజా కొంటుంది

టిడిపి మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చే విధంగా ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని టిడిపి మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గుళ్లపూడి శివారు గుడిపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లో, వాటి శివారు గ్రామాలతో కలుపుకుని అన్ని గ్రామాల్లో ధాన్యం పండించిన వరి పంటను, ఈ నెలాఖరుకు లక్ష మెట్రిక్ టన్నులు, వచ్చే నెలకు 7 లక్షల 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుడిపాడు టిడిపి గ్రామ అధ్యక్షులు మందలపు ధర్మరాజు, వలసపల్లి టిడిపి గ్రామ అధ్యక్షులు మేదరమెట్ల సురేంద్ర, టిడిపి జిల్లా నాయకులు కొల్లి గంగారం, కొర్లకుంట సొసైటీ అధ్యక్షులు పొట్లూరి అనురాధ పండరీనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అప్స డెమోక్రటిక్ రాష్ట్ర అధ్యక్షులు గొల్లపూడి మోహన్ రావు పేర్కొన్నారు. అప్స డెమోక్రటిక్ ఆధ్వర్యాన కైకలూరు డివిజన్ స్థాయి ఆటల పోటీలు ఆదివారం ముదినేపల్లిలోని ఇండో సాక్సన్ హై స్కూల్, గౌతం హై స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఈ ఆటల పోటీలను అప్స డెమోక్రటిక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్. కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన పోటీల్లో నియోజకవర్గంలోని కలిదిండి, ముదినేపల్లి, కైకలూరు, మండవల్లి మండలాల నుంచి 15 ప్రయివేట్ పాఠశాలలకు చెందిన 900 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్, కోకో, త్రో బాల్, మ్యూజికల్ చైర్, రన్నింగ్ తదితర ఆటల పోటీల్లో విద్యార్థులు నువ్వా, నేనా అన్నట్లు పోటీపడ్డారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు అప్స డెమోక్రటిక్ జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, అర్జా ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు ఎవి. కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.కనకదుర్గ భవాని, కోశాధికారి ఎస్‌వి.రాఘవయ్య, ఎంజె.జార్జి, బి.మదన్ కిషోర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు.

బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్స్

దాతల సహకారం అభినందనీయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం ఇస్తున్న నిధులకు తోడుగా గ్రామస్థులు భూమిని ఉచితంగా ఇవ్వడం అభినందనీయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నల్లమాడులో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్(ఆర్‌జిఎస్ఎ) కింద రూ.25 లక్షలు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(ఎంఎన్ఆర్ఇజిఎస్) చట్టం నుంచి రూ.7 లక్షలు మొత్తం రూ.32 లక్షలతో నూతనంగా పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. ఈక్రమంలో ఆదివారం పనుల శంకుస్థాపనకు ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నల్లమాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు పాతూరి నారాయణస్వామి(నాని) 8 సెంట్లు స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. అందులో కొత్త పంచాయతీ కార్యాలయం నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జి.రాము, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుడు గౌతు బాలభాస్కర్, టిడిపి, జనసేన మండల కమిటీ అధ్యక్షుడు వేములపల్లి సుధీర్, పి.రాంబాబు, కూటమి నాయకులు సుంకవల్లి మధు, పాతూరి నాని, డిప్యూటీ ఎంపిడిఒ గెడ్డం రమేష్, ఫణేంద్ర, పిఆర్‌డిఇ, ఎఇలు పాల్గొన్నారు.

దాత పాతూరి నారాయణస్వామిని సత్కరిస్తున్న ఎంఎల్ఎ

ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన 69వ అండర్-7 బాస్కెట్బాల్ బాలుర, బాలికల పోటీలు బెతస్థా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నూజివీడులో ఆదివారం ముగిసాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వాకా నాగరాజు తెలిపారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో నూజివీడు ఉప విద్యాశాఖాధికారి డాక్టర్ పిఎస్.సుధాకర్, పట్టణ సిఐ పి.సత్య శ్రీనివాస్, బెతస్థాస్కూల్ అధినేత బండిశ్యామ్, కరస్పాడెంట్ మెలోడి, టోర్నమెంట్ అబ్జర్వర్ పి.కృష్ణ, 13 ఉమ్మడి జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు, సబ్జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయటం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా నూజివీడు ఉపవిద్యాశాఖాధికారి మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ మన జిల్లాకు మంచిపేరు ప్రఖ్యాతులు తేవాలని కోరారు. బెతస్థా ఇంటిగ్రేటివ్ అధినేత బండి శ్యామ్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎప్పుడైనా మీరు ఏ గేమ్ అయినా తమ స్కూల్‌లో జరుపుకోవచ్చన్నారు. బాలికల మొదటి ప్లేస్ తూర్పు గోదావరి, రెండవ ప్లేస్ గుంటూరు, మూడవ ప్లేస్ విశాఖపట్నం, నాల్గవ ప్లేస్ కృష్ణా జిల్లా సాధించారని తెలిపారు. బాలురలో మొదటి ప్లేస్ కృష్ణా జిల్లా, రెండవ ప్లేస్ తూర్పుగోదావరి, మూడవ ప్లేస్ గుంటూరు, నాల్గవ ప్లేస్ చిత్తూరు సాధించారని తెలిపారు. ఎంపికైన బాస్కెట్బాల్ క్రీడాకారులు డిసెంబర్‌లో చత్తీస్‌ఘడ్‌లో జరిగే రాజ్ నంద్గామ్‌లో పాల్గొంటారని తెలిపారు. కృష్ణాజిల్లా బాలుర అండర్-17 విభాగంలో వరుసగా 8వ సారి మొదటి ప్లేస్ సాధించారని వాకా నాగరాజు తెలిపారు.

విజేతలుగా నిలిచిన కృష్ణా జిల్లా బాలుర జట్టు

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జెడ్‌పిటిసి పోల్నాటి బాబ్జి పుట్టినరోజు సందర్భంగా శ్రీనివాసపురం గ్రామంలో సాయిస్ఫూర్తి ఆధ్వర్యాన నిర్వహించిన మెడికల్ క్యాంపులో ముగ్గురు ఎంఎల్ఎలు పాల్గొని ఆదివారం శంకుస్థాపన చేశారు. చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్, పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ కలిసి రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లతో పాటు మరికొన్ని వసతుల పనులకు శంకుస్థాపన చేశారు. ప్రజల అభ్యున్నతే తమ లక్ష్యమని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.30 కోట్లతో సీసీ రోడ్లు, మరో రూ.80 కోట్లతో బిటి, ఆర్అండ్‌బి రోడ్ల పనులను చేపట్టామన్నారు. త్వరలో చింతలపూడి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోని అన్ని రహదారులను పూర్తిగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. శ్రీనివాసపురం గ్రామంలో జరిగిన మెడికల్ క్యాంపు, రక్తదాన కార్యక్రమం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనడం కార్యక్రమానికి మరింత ఉత్సాహం కలిగించిందని తెలిపారు.

మానసికోల్లాసంతో పని ఒత్తిడి దూరం

అధికారులకు, సిబ్బందికి వనభోజనాలు ఏర్పాటు చేసిన ఎంఎల్ఎ చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

మానసిక ఉల్లాసం ద్వారా పని ఒత్తిడిని జయిస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమని, దెందులూరు నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు నిత్యం తమ విధి నిర్వహణ ద్వారా సేవలు అందిస్తున్న వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నట్లు దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని ప్రజల కోసం తమ విధి నిర్వహణ ద్వారా సేవలందిస్తున్న వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ, వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తూ వారిని ప్రజా సేవా పట్ల మరింత ప్రోత్సహించేలా ఎంఎల్ఎ ఆధ్వర్యాన పెదవేగి మండలం జానంపేటలోని విజయ గార్డెన్స్‌లో ఆదివారం వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. దెందులూరు నియోజకవర్గంలోని వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి తంబోల, మ్యూజికల్ చైర్, క్విజ్ పోటీలు సహా పలు ఆసక్తికరమైన పోటీలను నిర్వహిస్తూ నిర్వాహకులు అందరిని అలరించారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా పాల్గొన్న అధికారులు, సిబ్బందికి ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనంలో విందును ఎంఎల్ఎ ఏర్పాటు చేశారు. అదేవిధంగా సేవా మార్గాన్ని ప్రజలకు మరింత స్ఫూర్తిదాయకంగా నిలిపిన భగవాన్ శ్రీసత్య సాయి బాబా శతజయంతి వేడుకల్లో భాగంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తన నియోజకవర్గ ప్రజల కోసం ప్రభుత్వ సేవలు అందించడంలో ఎంతో చక్కగా కృషి చేస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తూ వారందరికీ ఒక ఆహ్లాదకరమైన మనోవికాసాన్ని అందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రభుత్వం అమలు చేసే ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలైనా క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు చేరాలంటే వాటిల్లో ప్రభుత్వ ఉద్యోగుల కృషి ఎంతో గొప్పగా ఉంటుందని, సెలవు దినం రోజు ఈ విధంగా వనభోజనాల కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. తమ కుటుంబ సభ్యులందరితో ఆహ్లాదంగా గడిపేందుకు ఇంత గొప్పగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఎంఎల్ఎకు అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వనభోజన కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొని సందడి చేశారు.



వన సమారాధనలో పాల్గొన్న సిబ్బందితో ఎంఎల్ఎ

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి మధు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అర్హులైన ప్రతి రైతన్నకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు డిమాండ్ చేశారు. మండలంలోని బంధంచర్ల గ్రామంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు పెట్టుబడి సాయంగా ఏటా రూ.20 వేలు ఇస్తామని తొలి ఏడాది అన్ని పథకాల మాదిరిగా ఈ పథకాన్ని కూడా పూర్తిగా ఎగ్గొట్టారని విమర్శించారు. రెండో ఏడాది కోత పెట్టి ఏకంగా 7 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం ఎగ్గొట్టారని ఆయన తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో అమలు చేసిన వైఎస్ఆర్ రైతు భరోసా 53,58,366 మందికి ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్లలో అర్హుడైన ప్రతి రైతుకు చేసిన పెట్టుబడి సాయం రూ.67,500 చొప్పున రూ.34,378.16 కోట్లు అని వివరించారు. వైసిపి ప్రభుత్వం కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందించిందని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం కౌలు రౌతులకు మొండిచెయ్యి చూపిందని విమర్శించారు. ఇప్పటికే ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు, కనీస మద్దతు ధర కల్పన కోసం ధరల స్థిరీకరణ నిధి, ఇ-క్రాప్ విధానం, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి అన్ని సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు మంగళం పాడిన టిడిపి కూటమి ప్రభుత్వం రైతుల పాలిట శాపంలా మారిందని, చివరకు అన్ని తరగతుల వారిని మోసం చేసినట్లుగానే, రైతులకు కూడా కూటమి ప్రభుత్వం దారుణంగా దగా చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా ఎన్నికల వాగ్దానాలు సక్రమంగా అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

గాలి గోపురానికి కలశ స్థాపన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయానికి ఉపాయలయమైన శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన గాలిగోపురంకు ఆదివారం ఉదయం కలశ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఎంతో ప్రతిష్టాత్మంగా రూ.4.50 కోట్లతో నిర్మించిన ఈ గాలిగోపురం శివాలయమునకు ప్రత్యేక ఆకర్షణగా యాత్రికులను ఆకట్టుకుంటుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎస్‌వి.సుధాకర్ రావు, నివృతారావు, కార్యనిర్వాహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డివి.భాస్కర్ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన సమీక్షా సమావేశం, సంస్థాగత నిర్మాణ కార్యక్రమం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో సోమవారం జరగనున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఐసిసి పరిశీలకులు, ఎఐసిసి సెక్రటరీ ప్రవీణ్ ధావర్, ఎపిసిసి ఇన్‌ఛార్జి పాలక్ వర్మ, ఎపిసిసి మహిళా అధ్యక్షురాలు తాంతియా కుమారి హాజరవుతున్నారని ఆయన తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్లు, ఏలూరు నియోజకవర్గ నాయకులు, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మహారాజశ్రీ కాకినాడ 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు
E.P.No.213/2025,inO.S.No.872/2024
సాగి వెంకట సత్యనారాయణ వర్మ
...డిహెచ్‌ఆర్/వాది
మరియు
గుడుపూడి రమేష్ బాబు
...జెడిఆర్/ప్రతివాది
టు.
జెడిఆర్ గుడుపూడి రమేష్ బాబు(పి.సి.2438) తండ్రి.గుడుపూడి వెంకటరత్నం, ఇంటినెం.3-12, మాదేపల్లి, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా.
పై నెంబరు అమలు గ్రంధములో జెడిఆర్ అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.11-12-2025 తేదికి వాయిదా వేసయున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
చిత్తలూరి వెంకట సుబ్బారావు
చిత్తలూరి అనురాధ
అడ్వకేట్స్, డోర్‌నెం.5-81, సంతోష్‌నగర్, కాకినాడ
సెల్.9948519236

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో
O.S.547/2025
Between:
కొవ్వూరి అనురాధ (రిప్రజెంటెడ్ బై జనరల్ బాడీ ఆఫ్ క్రెడిటర్స్) ...వాది
మరియు
1.సత్తి వెంకట లక్ష్మి, W/o.కేశవరెడ్డి, D.No.3-84A, అర్జునుడుపాలెం, ఇరగవరం మండలం, ప.గో.జిల్లా.-534217, సెల్: 9392393936.
2.సత్తి వెంకట నాగేంద్రరెడ్డి, S/o.కేశవరెడ్డి, D.No.3-84A, అర్జునుడుపాలెం, ఇరగవరం మండలం, ప.గో.జిల్లా.-534217, సెల్: 9392393936.
...ప్రతివాదులు
పై గ్రంథములో వాది తనకు 1వ ప్రతివాది నుండి రావలసిన బాకీ రాబట్టుకొనే నిమిత్తం దాఖలు చేసినారని, సదరు దావాలో మొదటి ప్రతివాది అయిన మీరు వాదికి మరియు కొంత మందికి అప్పులు తీసుకుని ఆ అప్పులు చెల్లించకుండా ఉండుటకు గాను మొదటి ప్రతివాది తమ స్థిరాస్తులను రెండవ ప్రతివాది పేరు మీదగా సెటిల్మెంట్ దస్తావేజులు వ్రాయించి యిచ్చినారు. వాదికి మరియు అప్పులిచ్చిన క్రెడిటర్‌లకు బాకీలు తీర్చకుండా కాలయాపన చేయుచున్నారని, అందుచేత ఈ నోటీస్ పేపరు ద్వారా అమలు చేయవలెనని పై కోర్టు వారు ఆర్డర్ వేసినందున సదరు ప్రతివాదులు ది.11-12-2025 సం॥ తేదీన ఉదయం 10 గంటలకు పై కోర్టునకు హాజరై స్వయంగా గాని లేదా ప్లీడర్ గారి ద్వారా గాని తమ వాదనలు తెలియజేయవలసిందిగా, లేనియెడల సదరు దావా సదరు ప్రతివాదుల పరోక్షమున తీర్మానించెదరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
V.S.R.DEEKSHITULU
Tanuku
Advocate, Tanuku.
Dt.21-12-2025
Cell: 9346700133.